


# అనుక్షణం

## – సృజన్ సేన్

### పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
### కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో
### సాధారణ బహుమతి పొందిన నవల

(గతసంచిక తరువాయి)

"**అనుకోని సమస్యలు** వచ్చిపడుతుంటాయి. ఇందులో మనం చేయగలిగింది తక్కువ. చివరి నిముషం వరకు మన ప్రయత్నాలు మనం చేద్దాం. బాధగానే వుంటుంది. అయినా తప్పదు కదా!"

"అవును బావా... ముందు ఉద్యోగం ముఖ్యం. నేనంటే వ్యవసాయం, ధాన్యం వ్యాపారం లాంటివి చేస్తున్నాను. నేను అక్కతో మాట్లాడతాను. అయినా ఫోన్లున్నాయి. మనం మాట్లాడుకోవచ్చు. నువ్వు ఆఫీస్ కి బయలుదేరు" అన్నాడు.

ముందు కళ్యాణి ఆనందరావుకి కాఫీ యిచ్చింది. పది నిముషాల్లో వెంకటాద్రి ఆఫీస్ కి వెళ్లిపోయాడు.

"టిఫిన్ ఏం చేయమంటావు తమ్ముడూ" అంది కళ్యాణి.

"నాకేం తినాలనిపించటం లేదక్కా" అన్నాడు.

"అలా అంటే ఎలా... నువ్వు బ్రష్ చేశావా?"

"అదయితే అయింది".

"పది నిముషాలుండు" అని వంట గదికి వెళ్లింది. తర్వాత టిఫిన్ అందించింది.

"ఇంతకు ముందు వచ్చినప్పుడు అన్నాను. అత్తయ్యకు టెస్టులు చేయాలని. చిన్న చిన్న సమస్యలు వుంటాయనుకున్నాను. ఇంత పెద్ద సమస్య వస్తుంది అనుకోలేదు".

"ఇప్పుడు అత్తయ్య ఎక్కడుంది?"

"మన ఇంటికి తీసుకు వచ్చాం. కారులో తీసుకు వెళ్లి చూపించి వచ్చాం. ఇప్పుడు తనని హైదరాబాద్ తీసుకు వచ్చినా వనిత పక్క నుండాలి. ఓ పక్కన పిల్లలు చదువుకుంటున్నారు. పెద్దది ఇంటర్ ఫస్ట్ ఇయర్. రెండోది పదో తరగతికి వచ్చింది. చదువులు కూడా సమస్య కదా!"

"వనిత వాళ్ల అమ్మని రమ్మను".

''వాళ్లు రారులే. అయినా వనిత అన్నయ్య వాళ్లకు కడుపు మంటగా వుంది. ఆమె ఆస్తులు వనితకి రాసిందని. అత్తయ్యకి రావాలనున్నా రానీయడు. నేను నా వ్యాపారం వదిలి రాలేను. వసూళ్లు, పెట్టుబడులు, ఇవన్నీ వుంటాయి కదా!'' అన్నాడు.

''కేన్సర్ అంటే ఖర్చులు మామూలుగా వుండవు కదా!''

''అవును. లక్షల్లో వుంటుంది. ఇప్పుడు డబ్బులు చూసుకోవాలి. ఆమె దగ్గర క్యాష్ గా ఏమీ లేదు. ఇంతకు ముందు వరకు బాగా ఖర్చు పెట్టారు. ఇలాంటివి వస్తాయి అని ముందుగా అనుకోలేదు కదా!''

''అవునవును. ఇది వరకు మాకు మెడికల్ ఇన్స్యూరెన్స్ వుండేది. ఉద్యోగం మానేసిన దగ్గర్నుండి మీ బావగారు ప్రత్యేకంగా మా ఇద్దరికీ చెరో రెండు లక్షలకి మెడికల్ ఇన్స్యూరెన్స్ తీసుకున్నారు. అత్తయ్యకి అలాంటిది వుంటుంది అనుకోను''.

''అనుమానం అవసరం లేదు. అలాంటిదేం లేదు''.

''ఇంక చేయగలిగిందేముంది. ఇల్లో, పొలమో అమ్మండి. అంతకు మించి మార్గం లేదు. అయినా ఆవిడ డబ్బు ఆవిడకే ఖర్చు అవుతుంది. అసలు ఈ ఆస్తులు లేకపోతే ఏం చేసేవారు?''

''ఏం చేస్తారక్కా... జాలి పడతారు. ప్రేమ వున్న వాళ్లు నాలుగు రోజులు తీసుకువెళ్తారు. తర్వాత చేతులు ఎత్తేస్తారు''.

''మీ అత్తగారూ, ఆమె స్వయాన అక్కా చెల్లెళ్లు. కనీసం అక్క కోసం కొంత కాలం రావచ్చు కదా''.

''వాళ్లూ అదే అంటారు. మీ సరదా కోసం వనితని పెంచుకున్నారు. ఆస్తిని మాత్రం నీ చెల్లెలి పిల్లలకు ఇవ్వవు సమంగా. నీకు ఇంత పక్షపాతం వున్నప్పుడు ఎదుటివారికి కూడా వుంటుంది. అయినా ఆస్తి యిచ్చినప్పుడు నీ బాధ్యత వాళ్లదే. అన్నీ వాళ్లు చూసుకుంటారు. చూసుకోవాలి. ఈ వయసులో మా అమ్మ వచ్చి ఏం సేవలు చేస్తుంది? ఇద్దరు మనుషుల్ని పెట్టండి. ఏం కంగారు పడనవసరం లేదు. మీ స్వంత సంపాదన రూపాయి ఖర్చు పెట్టనవసరం లేదు. ఆమె డబ్బుని ఎంత ఖర్చు పెట్టినా ఇంకా మిగులుతుంది అని వనిత అన్న అన్నాడు. అన్నీ అయ్యాయిలే. ఏదో అంటారులే. మనకి డబ్బులు మాత్రమే రావు. దాంతో పాటు అన్ని దరిద్రాలూ వచ్చి మీద పడిపోతాయి'' అన్నాడు.

అదే సమయంలో వెంకటాద్రి ఆలోచనలు కూడా అలానే సాగుతున్నాయి. ఆనందరావు వాళ్లకు కలిసి వచ్చిందనుకుంటే ఇంతలో ఈ వార్త. అంటే తమకి కూడా ఇలాంటి దుర్వార్త రాబోతోందా? అది తనకి కావచ్చు. కళ్యాణికి కావచ్చు. అక్కడితో ఆగితే బాగుంటుంది. పిల్లలకు మాత్రం ఎలాంటి అపకారం జరగకూడదు. ఈ రోజుల్లో అనారోగ్యాలకి పిల్లలూ, యువకులూ పెద్దలు అని లేదు. అందరూ బలి అవుతున్నారు. డబ్బు మహిమ ఇది. ఇది లేకుంటే ఓ సమస్య, వుంటే రకరకాల సమస్యలు.

ఆ రోజే ఇది మనది కాదు అనుకుని వుంటే ఇంత ఘర్షణ వుండదు. అప్పుడు లోపలి మనిషి బయటకి వచ్చాడు.

"నువ్వేంటయ్యా ఈ గోల. నీకు డబ్బు దొరకలేదు. కేన్సర్ రాదా? కిడ్నీలు ఫెయిల్ అవవా? అప్పుడు హాస్పటల్ కి వెళ్లవా. అప్పుడు ఈ డబ్బు దొరికింది అనుకో. భగవంతుడు నాకు పంపాడనుకుంటావు. అంతే గాని వాటిని పంచవు. అసలు ఈ ప్రపంచంలో జరిగే వాటి గురించి చింతన అనవసరం. ఎవరికి ఏదివ్వాలో ఆ దేవుడికి తెలుసు. నువ్వు వద్దనుకున్నా కావాలనుకున్నా అది నీ చేతిలో వుండదు. ముందు ఆ డబ్బు నీ కళ్ల ముందున్నంత కాలం ఏం జరిగినా దానిని నీకు అన్వయించుకుంటావు. అందుకని ఆ మిగతా డబ్బు అర్జెంటుగా ఏదో ఒకటి చేసేయ్" అన్నాడు.

నిరంజన్ పిలిచాడు.

"చెన్నైలో ఓ సిక్ ఫ్యాక్టరీ అమ్మకానికి వచ్చింది. అప్పట్లో చాలా మంది భూములు కోసం, పబ్లిక్ నుండి షేర్స్ పేరుతో డబ్బులు రాబట్టి తర్వాత బిచాణా ఎత్తేయటం కోసం చాలా తమాషాలు చేశారు. ఇది అలాంటిది కాదు. మేనేజ్ మెంట్ లోపంతో దెబ్బ తిన్నారు. అందుకని మనం రన్ చేస్తే లాభాలు తెప్పించవచ్చు. అందుకని మనం ఓ సారి మాట్లాడి రావాలి".

"ఎప్పుడు సర్?"

"ఈ రోజే. ఆలస్యం అమృతం విషం అన్నారు కదా. అది తీసుకోవాలని ఇంకొంతమంది ప్రయత్నం చేస్తున్నారు. ల్యాండ్ తోపాటు రెండు పెద్ద భవనాలున్నాయంట. మనం చూస్తే వాల్యూ గురించి అంచనాకి రావచ్చు. ఆ బిజినెస్ మనం కంటిన్యూ చేయకపోయినా ఇప్పుడు మన ఫ్యాక్టరీ ప్రొడక్ట్ ని అక్కడ కూడా తయారు చేద్దాం. మనకు ట్రాన్స్ పోర్టేషన్ ఖర్చులు చాలా కలిసొస్తాయి".

"బాగుంది నిరంజన్ గారూ...."

"రైట్. మనం నైట్ టైం ఫ్లయిట్ కి వెళ్తున్నాం. వెంటనే మీరు ఇంటికి వెళ్లిరండి. మనకి ఇంకో రెండు గంటలు మాత్రం టైం వుంది".

"మనం చెన్నై నుండి వచ్చాక ఇంకో ట్వంటీ ఫైవ్ లాక్స్ క్యాష్ గా ఇస్తాను సర్" అన్నాడు.

"గుడ్ గుడ్.. అలాగే" అన్నాడు నిరంజన్.

★ ★ ★

వెంకటాద్రి ఇంటికి వచ్చేటప్పటికి ఆనందరావు బయలుదేరటానికి తయారుగా వున్నాడు. అప్పటికే బస్ టికెట్ బుక్ చేసుకున్నాడు. చెప్పి వెళ్దాం అని ఆగాడు. తను కూడా తయారవ్వాలని వెంకటాద్రి చెప్పాడు. మీ ఇద్దరూ మాట్లాడుకున్నారు కదా అన్నాడు. అతను తలూపాడు. ఏమీ అనుకోవద్దు అని తను వెళ్లాడు. ఆనందరావు వెళ్లాడు.

అంతకు ముందే ఎందుకయినా మంచిదని దాదాపు బట్టలు సర్దింది. బెంగళూరులో బట్టలు తీసుకున్నాడు గాని ఇంతవరకు వాటిని తొడగలేదు. అతను స్నానం చేసి రాగానే 'ఈసారి జీన్స్ వేసుకోండి' అంది కళ్యాణి.

ఏమనుకున్నాడో అలాగే అన్నాడు వెంకటాద్రి.

తమ్ముడి విషయం చెప్పింది. అతను పిల్లల గురించి ఆలోచిస్తున్నాడు. తనకి ఓ అమ్మాయిని మన ఇంటి దగ్గర వుంచి చదివించాలని వుందనుకుంటాను అని చెప్పింది. వెంకటాద్రి మాట్లాడలేదు. అలాగే అత్త గారిని ఎక్కడ చేర్పించాలి అనే విషయంలో కూడా ఇంకా ఓ నిర్ణయానికి రాలేకపోతున్నాడు అంది. బహుశా పెద్ద అమ్మాయిని ఇంటర్ సెకండ్ యియర్ లో తమ దగ్గరికి పంపించవచ్చు. ఇంట్లో పిల్లలు లేరు కాబట్టి అది పెద్ద సమస్య కాదు.

ఆనందరావు మనసులో ఇంత వరకే వుందా? ఇంకేమైనా ఆలోచన వుందా? ఆదిత్యని అల్లుడిని చేసుకోవాలనుకుంటున్నాడా అని ఆలోచన వచ్చింది. ఇంతకు ముందు ఎప్పుడూ మాట వరసకి కూడా అలాంటి సంభాషణ చోటు చేసుకోలేదు. పిల్లల పెళ్లిళ్లకు ఇంకా సమయం వుంది. ఓ పక్కన నిరంజన్ మీద తనకు ఆశలు పెరుగుతున్నాయి. అందులోనూ ఆదిత్య డైనమిక్ గా తయారవుతున్నాడు. అతన్ని సంపూర్తిగా ఉపయోగించుకోవచ్చు నిరంజన్.

అయినా ఇవన్నీ ఇప్పటికిప్పుడు జరిగేవి కావు. తొందరపడాల్సింది లేదు. ఆనందరావు అలాంటి ప్రపోజల్ తీసుకురావటం జరిగితే మాత్రం ఒకటే చెప్పాలి. ఇందులో నా పాత్ర వుండదు. అంతా ఆదిత్య ఇష్టం. తనకు ఇష్టం అయితే నాకు అభ్యంతరం వుండదు. అయితే ఇంకో కారణం కూడా వుంది. మేనరికాలకు ఈ మధ్య అందరూ ఒప్పుకోవటం లేదు. మరీ ఆస్తులు ఎక్కువగా వుండి అవి బయటకు వెళ్లటం ఇష్టపడని వారు మాత్రం అలాంటి పెళ్ళిళ్లు చేస్తున్నారు. అయినా పుట్టబోయే వారి విషయంలో మాత్రం ఆ ప్రమాదం వుంది.

ఫ్లయిట్ దగ్గర కొద్ది క్షణాలు నిరంజన్ ప్రత్యేకంగా చూశాడు. "ఇలాంటి డ్రెస్ లో నిన్ను చూడటం ఇదే మొదటిసారి" అన్నాడు – చిన్నగా నవ్వుతూ.

"ఎప్పటి నుంచో కోరిక వుంది. నాలో కొన్ని బలహీనతలు వున్నాయి నిరంజన్ గారూ... నేను త్వరపడి ఓ నిర్ణయానికి రాలేను. చిన్న చిన్న విషయాల గురించి ఎక్కువ ఆలోచిస్తాను. ధైర్యం తక్కువ. అలా వుంటే కుదరదని అర్థం అయింది. అందుకని అలాంటి వాటి నుండి బయట పడాలనుకుంటున్నాను. బెంగళూరులో కొన్నాను. ఈ రోజు ధైర్యం చేశాను".

"బాగుంది. వీటిలో కాస్త సౌకర్యం వుంది. అలాగే యిబ్బందీ వుంది. మన వయసు పది సంవత్సరాలు తగ్గినట్లు అనిపిస్తుంది. ఆ రకంగా ఉత్సాహంగా పని చేయవచ్చు. మనం కొన్ని చోట్ల కాస్త రఫ్ గా కనిపించాలి. కనిపించటం కాదు యాక్ట్ చేయాలి. లేకుంటే ఈ సొసైటీలో బతకటం కష్టం" అన్నాడు నిరంజన్.

అలాగే ట్రావెలింగ్ లో పిల్లల ప్రస్తావన వచ్చింది.

"ఈ మధ్య మా పిల్లల్తో మాట్లాడాను నిరంజన్ గారూ... నాకు ఆశ్చర్యం కలిగింది. ఇంత డైనమిక్ గా వున్నారా అనిపించింది. ఇప్పుడు అమ్మా నాన్నలు మనకి ఏ ఆస్తులు యిస్తారని అందరూ అనుకోవటం లేదు".

"అవును. ప్రతి దశాబ్దాన్ని మనం గమనిస్తే యువతరం మారుతూ వస్తోంది. ఆ కాలంలో కొన్ని ధోరణులుంటాయి కదా! అవి వాళ్ల జర్నీని డిసైడ్ చేస్తాయి. మా అమ్మాయి వుంది. తను అడుగుతుంది. డాడీ మీరు ఒక్కరినే ఎందుకు కన్నారని".

"అప్పటి పరిస్థితి అది. నువ్వు ఎంత మందిని కనాలనుకుంటే అంత మందిని కను. నేనూ మీ అమ్మా వాళ్లని పెంచుతాం అంటుంటాం".

"అమ్మాయికి స్టేట్స్ గాని, యు.కె. గాని వెళ్లాలనుందా?"

"ఇంత వరకు అలాంటిది వున్నట్లు మాకు అనిపించలేదు. మనుషుల అభిప్రాయాలు ఎంత సేపట్లో మారతాయి వెంకూ. అంత దూరం పంపించటం మాకు ఇష్టం లేదు. మాకున్నది ఒక్క కూతురు. ఇప్పుడివన్నీ తన కోసం చేస్తున్నాను. అబ్బాయి వుంటే ఆ బాధ్యతలు తీసుకునేవాడేమో. ఇప్పుడు అమ్మాయి, అల్లుడు తీసుకుంటే సంతోషిస్తాను. నాకు ఓ బలహీనత వుంది. అమ్మాయికి దూరంగా వుండలేను".

"మీ పాపకి అయిన సంబంధాలు వున్నాయా?"

"అలాంటివేం లేవు. బయట చూడాల్సిందే".

"ఇంకోలా అనుకోవద్దు. ఎవరన్నా ఇల్లరికం వస్తే బాగుంటుంది అని నాకు అనిపిస్తోంది".

"వెంకూ... మనం ఇతరుల అభిప్రాయాలకు విలువ ఇవ్వటం మంచిది. ఇల్లరికం నన్ను రమ్మంటే నేను వెళ్లేవాడిని కాదు. అప్పుడు నేను ఇలాంటి ఆర్థిక పరిస్థితిలో లేను. రేపూ అంతే. అమ్మాయి మా కళ్ల ముందుండాలి అంటే అర్థం మాతో వుండాలని కాదు. దగ్గర్లో వుంటే చాలు కదా. కొత్త జనరేషన్ కి రకరకాల కోరికలుంటాయి. ఇల్లరికానికి మా అమ్మాయే ఒప్పుకోకపోవచ్చు. తనదైన కుటుంబం. తను కోరుకున్నట్లు తన సంసారాన్ని డిజైన్ చేసుకోవాలి అని అమ్మాయికి వుంటుంది".

"బాగుంది నిరంజన్ గారూ... నా వరకు నేను అనుకుంటాను. వారికి వారు తమ భాగస్వామిని ఎన్నుకుంటే బాగుంటుందని".

"యు మీన్ లవ్".

"అది లవ్ కావచ్చు. లేదా ఒకే చోట పని చేస్తున్నప్పుడు వచ్చే అండర్ స్టాండింగ్ కావచ్చు. ఈ జనరేషన్ లో అందరూ గుడ్డిగా 'లవ్' అనే దానికి పరిమితం కావటం లేదు. అన్ని కోణాల్లో ఆలోచిస్తున్నారు".

"చూద్దాం. మనం ఎన్ని మాట్లాడుకున్నా అలాంటి మూమెంట్స్ వచ్చాక గాని ఆ అనుభవాలు ఎలా వుంటాయో తెలియదు".

"నిజమే" అన్నాడు వెంకటాద్రి.

సిక్ ఇండస్ట్రీని ఇద్దరూ చూసారు. అయిదారు ఎకరాల స్థలం వుంది. అందులో పెద్ద గోడౌన్లు లాంటివి రెండున్నాయి. ఒకదాంట్లో మాత్రం అడ్మినిస్ట్రేషన్ కోసం చేసిన ఛాంబర్స్ వున్నాయి. ఎన్ని నెలల నుండి అక్కడ కార్యకలాపాలు ఆగాయో, గడ్డి బాగా పెరిగిపోయి వుంది. స్థలం మాత్రం బాగుంది. వెంకటాద్రికి నచ్చింది.

"ఆరు నుండి ఏడు కోట్లు చెబుతున్నారు. మధ్యలో ఎక్కడో తేలుతుంది. లోతులకు వెళ్తే తెలిసింది అది ముగ్గురు అన్నదమ్ములది. వారిలో వారికి పడటం లేదు. అందుకని క్రమంగా దెబ్బ తినిపోయింది. ఇప్పుడు కొన్ని బాకీలు కూడా వున్నాయి. కరెంట్ కట్ చేశారు బిల్లులు చెల్లించకపోవటంతో. ముందు ముందు ఆ భూమి ధర పెరుగుతుంది. అక్కడ ఎంట్రెన్స్ లో సెక్యూరిటీ గార్డ్ మాత్రం వున్నాడు. అలాగే బ్యాంక్ లోన్స్ ఎంత వున్నాయో తెలియాలి. ఒకరికి తెలియకుండా ఒకరు ఏమన్నా తాకట్టు పెట్టారా? ఇంకేమైనా లొసుగులున్నాయా?" అన్నాడు నిరంజన్.

ఏమైనా ముగ్గురూ అమ్మే విషయంలో ఓ నిర్ణయానికి రావాలి. వాళ్ల తండ్రి మాత్రం ముగ్గురికీ సమాన వాటాలు రాయటం జరిగింది. ఇండస్ట్రీస్ డిపార్ట్ మెంట్ వారిని కలవాల్సి వుంది. రెండు రోజులు అక్కడే వుండాలి. మధ్య వర్తులున్నారు.

ఫాక్టరీ ఓనర్లు కోల్ కతాలో వున్నారు. వారికి కబురు వెళ్లింది.

"అక్కడ నుండి వచ్చి చెన్నైలో ఇండస్ట్రీ పెట్టారా? " అన్నాడు వెంకటాద్రి.

"పరిశ్రమ అంటేనే అది. మనం బెంగళూరు వెళ్లాం. ఇక్కడికి వచ్చాం. ఎవరయినా అంతే. వెనక బడిన ప్రాంతాల్లో పరిశ్రమలు పెట్టాలంటారు. అందుకు రాయితీలు ఇస్తారు. అలాగే కొన్ని చోట్ల లేబర్ చవక. అలాగే సమ్మెలు జరగవు. అతి కొద్ది మంది ఇలాంటివి ఉపయోగించుకోవటానికి వస్తారు" అన్నాడు నిరంజన్.

"ఏది ఏమైనా, ఎంతగా ఇండస్ట్రీస్ లో సక్సెస్ అయినా ఫ్యామిలీలో చీలికలు రానంత వరకే. అదంటూ మొదలయితే ఎంత పెద్ద సామ్రాజ్యమైనా కూలిపోవాల్సిందే".

"అవును వెంకూ... మన కళ్ల ముందు అలాంటి అన్నదమ్ములున్నారు. తండ్రీ బిడ్డలున్నారు. అందుకే అంటారు. లక్ష్మి చంచలం. ఎల్లకాలం ఒకరి దగ్గరే, ఓ కుటుంబం దగ్గరే వుండదు. మూడు నాలుగు జనరేషన్స్ వుంటే గొప్ప".

రెండు రోజుల తర్వాత హైదరాబాద్ వచ్చారు.

ఫ్యాక్టరీ వాళ్లు వచ్చారు. వాళ్ల తండ్రి చివరి వార్నింగ్ యిచ్చాడంట. మీరు ఇలా కొట్టుకు ఛస్తే అది అలానే పడుంటుంది. ఈ లోగా బాకీలు పెరుగుతాయి. బ్యాంకు వారో, మరొకరో స్వాధీనం చేసుకుంటారు. అమ్మేస్తారు. అప్పులు పోను మీకు రూపాయి రాదు. ఇప్పటికే విలాసాలకు అలవాటుపడ్డారు. తర్వాత మీ ఇష్టం అని. తమాషా ఏమంటే ఇంత వరకు వారు తమకు తెలిసిన వారినో, దగ్గర బంధువులనో అక్కడుంచారు. అంతే తప్ప నిర్వహణలో భాగం పంచుకోలేదు. నడిచినంత కాలం బాగా నడిచింది.

ముసలాయన మాత్రం తెలివిగలవాడు. అతను ఇంతకంటే పెద్ద వాటిని నెలకొల్పాడు. తను మంచి ఉత్పత్తుల ద్వారా సంపాదించాలనుకున్నాడు. పిల్లలందరూ వాటిని విచ్చలవిడిగా ఖర్చు చేయటానికి అలవాటు పడ్డారు. కథ అడ్డం తిరిగింది.

మొత్తం మీద నెల రోజుల్లోపు అన్ని వివరాలు అందచేస్తారు. నోడ్యూస్ సర్టిఫికెట్లు వచ్చాక మాత్రమే రిజిస్ట్రేషన్ జరుగుతుంది. అందుకు ముగ్గురూ ఒప్పుకున్నారు. ఇప్పుడు తలకో కోటిన్నర వచ్చినా ముందు ఖర్చులకు ఉపయోగపడతాయి అనే స్థాయికి వచ్చారు.

ఈ సారి వెంకటాద్రికి కొత్త అనుభవాలు వచ్చాయి. నిరంజన్ తో మరింత దగ్గర తనం వచ్చినట్లు అనిపించింది. నాలుగు రోజుల తర్వాత ఇంటి నుండి డబ్బు వేరే బ్యాగ్ లో సర్ది తీసుకు వెళ్తున్నాడు. అప్పుడు అంది కళ్యాణి.

"మీరు చాలా మారిపోయారు".

"అదేంటి?"

"అందులో ఏముంది?"

"సూటిగా అడుగు".

"ఎన్ని లక్షలున్నాయి?"

బ్యాగ్ ని కింద పెట్టాడు. కళ్యాణి కళ్లల్లోకి సూటిగా చూశాడు.

"ఎన్ని లక్షలున్నాయో నీకు తెలియదా?"

"నేను లెక్క పెట్టలేదు"

"ఈ డబ్బుల గురించి నీకు ఎలా తెలిసింది?"

"అటక మీద ఏదో కావల్సి వచ్చింది. పాత సూట్ కేసుని సర్దాలి అని కదిపాను. అందులో ఏవో కదిలినట్టు అనిపించింది. ఏమీ పెట్టిన గుర్తు రాలేదు. కిందకు దించి చూశాను. నాకు.... " అని ఆగింది.

"అది ఆఫీస్ కి చెందిన డబ్బు. నిరంజన్ గారు మీ ఇంటి దగ్గర వుంచండి అన్నారు. ఇప్పుడు వారి డబ్బు వారికి ఇవ్వటానికి తీసుకుని వెళ్తున్నాను".

"ఆ విషయం నాకు చెప్పవచ్చు కదా!"

"ఆఫీస్ లో జరిగే అన్ని విషయాలు ఇంట్లో చెప్పలేం కళ్యాణి. ఇది మన డబ్బు కాదు. మన డబ్బు గురించి రహస్యం అంటూ లేదు. అసలు నీకు తెలియకుండా నేను మన పెళ్లి అయిన దగ్గర్నుండి ఎలాంటి ఆర్థిక వ్యవహారాలు నడపలేదు. అది నీకు బాగా తెలుసు".

"అదే నా బాధ... ఇప్పుడేమయిందని!"

"చెబుతున్నాను. ఈ డబ్బు గురించి చెప్పిన దగ్గర్నుంచి నన్ను ప్రశ్నలు అడుగుతావు. ఇంత డబ్బు ఇంట్లో వుంటే ప్రమాదం కదా అని భయపడతావు. అసలు నేను ఊరుదాటి వెళ్తే మరింతగా కంగారు పడతావు. ఇది చిన్న మొత్తమే. ఒక్కోసారి కోట్లలో వుండవచ్చు".

"అది ఎవరన్నా ఎత్తుకుపోతే".

"ఆ విషయం నాకు తెలియదా? నేను నిరంజన్ గారితో మా ఇంట్లో వుంచటం సేఫ్టీ కాదు అననా? అందుకు ఇష్టపడే ఎవరయినా ఇలాంటి పనులు చేస్తారు. ఇది నిరంజన్ గారికి చిన్న ఎమౌంట్. నిజంగా దొంగతనం జరిగినా ఆయనకు ఇదో లెక్క కాదు. ఎదుటి మనిషి క్యారక్టర్ ని పరిశీలించటానికి ఇలా చేస్తుంటారు. అలాగే ఒక్కోసారి అవసరానికి తప్పక ఇలా చేస్తారు. ఆడవారికి కొన్ని విషయాలు చెప్పకూడదు. దాని వల్ల సమస్యలు వస్తాయి. అలాగే మగవాళ్లకి కూడా. భయపడేవారికి, బలహీనతలున్న వారికి చెప్పకపోవటం మంచిది. ఓ పక్క నుంచి కొత్త కొత్త వ్యాపారాలు చేస్తున్నప్పుడు ఇలాంటివి జరుగుతాయి. ఇప్పుడు నేను అడుగుతున్నాను. నువ్వు ఇప్పటి దాకా నన్ను ఎందుకు అడగలేదు".

కళ్యాణి మాట్లాడలేకపోయింది.

"ఇది పిల్లలకు చెప్పావా? మీ తమ్ముడికి చెప్పావా?"

"లేదు లేదు" అంది.

"చెప్పకపోయావా?"

తనకు ఏం సమాధానం చెప్పాలో అర్థం కాలేదు.

"మీరు మారిపోయారు అంటే అర్థం ఏమిటి? నాకు ఇంకో ఫ్యామిలీ వుందా? నీకు తెలియకుండా సంపాదన వుందా? నేను ఎవరికన్నా డబ్బు దోచిపెడుతున్నానా? అసలు నీకు ఈ అనుమానాలు ఇప్పుడు ఎందుకు వస్తున్నాయి?" అన్నాడు సీరియస్ గా.

"ఎందుకు ఇన్ని మాటలు అంటారు. ఇంతకు ముందు నిరంజన్ గారు వాటా ఇస్తాం అన్నారు. అందుకని బ్యాంక్ నుండి డబ్బులు తీసుకు వచ్చారేమో. అలా అయితే చెప్పే వారు కదా. ఎందుకిలా చేస్తున్నారు అనుకున్నాను. అంతకు మించి పిచ్చి ఆలోచనలు నాకు రాలేదు. మీరు నమ్మినా, నమ్మకున్నా" అంది కళ్యాణి.

"ఆ డబ్బుయింకా బ్యాంక్ లోనే వుంది. అది ఎప్పుడయినా డ్రా చేసి నిరంజన్ గారికి ఇస్తాను. సరేనా?"

"మంచిదండి. ఇంక నేనూ ఏదీ మిమ్మల్ని నోరు తెరిచి అడగను. నన్ను క్షమించండి" అంది చేతులు జోడించి.

నిరంజన్ ఇంటికి చేరుకున్నాడు.

అప్పుడే వాళ్ల అమ్మాయి బయటకు వెళ్తూ అమ్మా నాన్నలకు 'బై' చెబుతోంది.

నిరంజన్ తన అమ్మాయిని, భార్యనూ పరిచయం చేశాడు. అమ్మాయి పేరు విజేత. శ్రీమతి స్వర్ణ. 'వెంకటాద్రి అంకుల్. ఇంతకు ముందు చెప్పాను' అన్నాడు. 'హలో అంకుల్' అంది చిరునవ్వుతో. చక్కగా వుంది. చూడగానే ఓ మంచి ఫీలింగ్ కలిగింది. 'బై అంకుల్' అని సెలవు తీసుకుంది.

తర్వాత ఆమె స్వయంగా కాఫీ తీసుకు వచ్చింది.

''మీ శ్రీమతిని, పిల్లల్ని తీసుకురండి'' అంది స్వర్ణ.

''పిల్లలు బెంగళూరులో చదువుకుంటున్నారు. త్వరలో వస్తారు. ఓ రోజు తప్పకుండా వస్తాం'' అన్నాడు వెంకటాద్రి. ఆమె తలూపి వెళ్ళింది.

''ఏంటోయ్ అన్నీ రెండు వేల నోట్లు. ఈ మధ్య వీటిని తగ్గిస్తున్నారు. ఓ సారి బ్యాంకులో డిపాజిట్ చేస్తే వాటిని మళ్ళీ బయటకు రానీయటం లేదు అంటున్నారు''.

''ఇవయితే తీసుకురావటానికి ఈజీగా వుంటుంది. అయినా వీటిని రద్దు చేస్తారంటారా?''

''ఏమో... ఏమైనా జరగవచ్చు. ఇంతకు ముందు అలా జరుగుతుంది అనుకున్నామా?''

''అప్పట్లో మీకు ఏమైనా లాస్ అయిందా?''

''అదేం లేదు. నేను లిక్విడ్ క్యాష్ వుంచను. తర్వాత పేమెంట్స్ యిచ్చేటప్పుడు కొందరు పాత నోట్లు ఇవ్వబోయారు. మన లెక్క చెప్పగలిగే వరకు తీసుకున్నాం'' అన్నాడు.

అప్పుడు నేను బయలుదేరతాను అన్నాడు. ఈసారి నిరంజన్ ఇంతకు ముందులా డబ్బు అందినట్లు రిసిప్ట్ గాని, డాక్యుమెంట్ గాని ఇవ్వలేదు. వెంకటాద్రి అడగలేదు. ముందు ఈ రోజుతో తన తల మీద పెద్ద బరువు తొలిగిపోయిందన్న సంతోషం మాత్రం కలిగింది.

ఆఫీస్ కి వెళ్తున్నప్పుడు అనుకున్నాడు.

''నిరంజన్ స్వర్ణగారికి ఈ విషయం చెబుతాడా?''

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS